ప్రజాశక్తి
బుధవారం 7 ఫిబ్రవరి 2024
5
అల్లూరి సీతారామరాజు

మూగజీవాలకు వ్యాక్సినేషన్

వ్యాక్సినేషన్ చేస్తున్న డాక్టర్ రాజాశ్రీ, సిబ్బంది

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మూగజీవాలకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రభుత్వ పరంగా ఉచితంగా వ్యాక్సినేషన్ చేస్తున్నట్లు స్థానిక మండల పశు వైద్యాధికారి డాకటర్ రాజాశ్రీ తెలిపారు. గిరిజన రైతులంతా దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంగళవారం మండలంలోని అరకు పంచాయతీలో పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ జి.శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా 500 మూగజీవులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేశారు. వెటర్నరీ అసిస్టెంట్ సుబ్బారావు, ఎహెచ్ఎలు ఎస్ రమేష్, త్రినాధరావు, జయరాజు, సంజీవ్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని

పక్కాగా అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుండి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తోందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అరకు, పాడేరు నియోజకవర్గాలకు సంబంధించి రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లకు ఎన్నికల ప్రక్రియపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ రోజున చేయాల్సిన పనులు, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుపై అవగాహన కల్పించారు. జిల్లాలో 150 వరకు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఆయా కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణపై సూచనలు చేశారు. ప్రతి నియోజకవర్గంలో మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్లు, సూక్ష్మ పరిశీలకులు పర్యటించి అన్నింటినీ పరిశీలిస్తారన్నారు. సెక్టర్ అధికారుల బాధ్యతలను, విధులను వివరించారు. ఎన్నికల సామగ్రిని సెక్టార్ అధికారుల పర్యవేక్షణలో పోలింగ్ కేంద్రాలకు తరలిస్తారన్నారు.

గంటన్నర ముందుగా మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచిస్తూ, దీనిపై అవగాహన కల్పించారు. ఇవిఎంలు పనిచేయక పోతే తీసుకోవలసిన చర్యలు, అదనపు ఓటింగ్ యంత్రాలు సమకూర్చడం తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గర్భవతులకు, బాలింతలకు, వికలాంగులు, అంధులకు ప్రత్యేకంగా ప్రవేశం కల్పించి ఓటు హక్కు వినియోగించుకునే సదుపాయం కల్పించాలని సూచించారు. ప్రెసైడింగ్ అధికారి డైరీ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు బహిరంగ సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడానికి జిల్లా ఎన్నికల అధికారి, పోలీస్ అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎన్నికల విధులపై అధికారులకు పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావన వశిస్ట్, సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, ఎస్‌డిసి పి.అంబేద్కర్,

ఆశాల 'చలో విజయవాడ'ను

విజయవంతం చేయండి

పలు పిహెచ్‌సిల వద్ద సన్నాహక సమావేశాలు.. వైద్యాధికారులకు వినతిపత్రాల అందజేత

డుంబ్రిగుడలో ఆశాల ఆందోళనలో మాట్లాడుతున్న పోతురాజు

భీమవరం పిహెచ్‌సి వద్ద ఆందోళన చేస్తున్న ఆశాలు

ప్రజాశక్తి- డుంబ్రిగుడ : ఆశాల సమస్యల పరిష్కారానికి ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహించే చలో విజయవాడ ఆందోళనను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆశా కార్యకర్తల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని వైద్యాధికారి రాంబాబుకు వినతిపత్రాన్ని అందజేశారు.

సీలేరులో ఆశాల ఆందోళన

ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ, గ్రామస్థాయిలో సవాలక్ష సమస్యలతో ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తున్నఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఆశాల సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి పెద్దఎత్తున తరలివచ్చి, చలో విజయవాడను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకుడు. సత్య నారాయణ, ఆశా కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలు మేరి పాల్గొన్నారు.

అనంతగిరి : ఆశా, సిహెచ్‌డబ్ల్యూ వర్కర్ల సమస్యలు పరిష్కారానికి ఈనెల 8. 9 తేదీల్లో చలో విజయవాడ జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి కిల్లో మొస్య కోరారు మంగళవారం ఆశాడే సందర్భంగా సిఐటియు ఆద్వర్యంలో భీమవరం, అనంతగిరి పిహెచ్‌సిల వద్ద ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా మొస్య మాట్లాడుతూ, ఆశాలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సిహెచ్‌డబ్ల్యులకు ఆశాలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించేంత వరకు అంగన్వాడీల తరహాలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో సిపిఎంమండల కార్యదర్శి ఎస్.నాగులు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జె. సుబ్బారావు, ఆర్ శ్రీను, ఆశాలు చిన్నతల్లి, దేముడమ్మ, శైలు కల్యాణి, కౌసల్య పాల్గొన్నారు

సీలేరు: ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సిహెచ్‌డబ్ల్యులను ఆశ్వా వర్కర్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని సిఐటియు జికె.వీధి మండల కార్యదర్శి జి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం జీకే వీధిలో ఆశావర్కర్ల సమావేశంలో మాట్లాడుతూ పెదవలసలో ఆశావర్కర్లు సమస్యలపై ధర్నా నిర్వహించినట్లు చెప్పారు. పెరిగిన నిత్యవసర సరుకులు ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, లేకుంటే అంగన్వాడీల పోరాట స్ఫూర్తితో ఆశా వర్కర్ల హక్కుల కోసం పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈనెల 8, 9 తేదీల్లో చలో విజయవాడ కార్యక్రమానికి ఆశా వర్కర్లు భారీ సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఎం.జ్యోతి, చిన్నారి, పి.ప్రభశ, విజయ, రత్నకుమారి పాల్గొన్నారు.

సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణకు రక్త నమూనాల సేకరణ

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాలలో సికిల్ సెల్ వ్యాధి ఉన్న వారిని గుర్తించేందుకు ఎఎన్ఎంల ద్వారా రక్త నమూనాలు సేకరించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. ఎడిఎంహెచ్ఒ, పిహెచ్‌సి వైద్యాధికారులతో స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో నేరుగా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం పిఒ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని ఏడు మండలాల్లో 2,18,385 మంది జనాభా ఉందని, 18 పిహెచ్‌సి పరిధిలోని ప్రతి ఇంటికీ, అన్ని పాఠశాలలకు ఎఎన్ఎంలు వెళ్లి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించేందుకు 79,425 కిట్లు వచ్చినట్లు చెప్పారు. ఇప్పటికే రక్తపరీక్షల్లో సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ అయిన వారి వివరాలు ఎంతమందివి అప్‌లోడ్ చేసింది ఆరా తీశారు. సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు 40 సంవత్సరాల లోపు ఉన్న వారికి మాత్రమే చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి పిహెచ్‌సి పరిధిలో ఈ పరీక్షలు చేయాలని, వీటిని వైద్యాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ వ్యాధి ఉన్న ఇద్దరు యువతీ యువకులు పెళ్లి చేసుకోకూడదన్నారు. ఈ సికిన్ సెల్ వ్యాధిగ్రస్తులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పింఛన్లు ప్రతి నెల అందించడం జరుగుతుందని చెప్పారు. ప్రతినెల ఎంతమంది గర్భిణులకు డెలివరీ చేయుచున్నది, వారిలో ఎంతమందికి సిజరిన్ ద్వారా డెలివరీ చేయుచున్నది అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఏడిఎంహెఓ డాక్టర్ జి.ప్రకాశం, వైద్యాధికారులు రాధిక, కెల్విన్, సాహిని, ఎంపిహెచ్ఓ పీటర్, జిసిసి డిఎం జి.పార్వతీశ్వరరావు, వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాసరావు, వివిధ పిహెచ్‌సి వైద్యాధికారులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న సిఆర్‌పిఎఫ్ కమాండెంట్ రితేష్ ఠాగూర్

వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-చింతూరు

మన్యంలో ఎఫ్/141 సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ క్యాంపు ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్‌లో భాగంగా చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి పంచాయతీ పరిధి విద్యనగరం పాఠశాలలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతుల ప్రదానం చేశారు. సిఆర్‌పిఎఫ్ సెకండ్-ఇన్-కమాండ్ సి.ప్రీత ఈ మ్యాచ్‌లను ప్రారంభించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 141 బిఎన్ సిఆర్‌పిఎఫ్ కమాండెంట్ ఎస్‌హెచ్.రితేష్ ఠాకూర్ హాజరయ్యారై విజేతలైన ఏడుగురాల్ల పల్లి జట్టుకు, రన్నర్ మద్ది గూడెం జట్టుకు ట్రోఫీలను, వాలీబాల్ పోటీలలో పాల్గొన్న తుమ్మల, తాటిలంక, విద్యనగరం గ్రామాల జట్లకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా రితేష్ ఠాకూర్ మాట్లాడుతూ మారుమూల గ్రామాలలో వారి అవసరాలను గుర్తించి సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని, దేశ వ్యతిరేక శక్తులను అరికట్టడానికి కార్యాచరణ చేపడుతున్నామని చెప్పారు. సాధారణ ప్రజలతో సత్సంబంధాలను కొనసాగించడానికి మంచి సమాజాన్ని నిర్మించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మద్దిగూడెం హైస్కూల్ హెచ్ఎం బి.చిన్నబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

10న చింతపల్లిలో షర్మిల సభకు తరలిరండి

అరకు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి శాంతకుమారి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ఈ నెల 10న చింతపల్లిలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని ఆ పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాచిపెంట శాంతకుమారి కోరారు. మంగళవారం మండలంలోని గుంటసీమలో కాంగ్రెస్ పార్టీ నాయకులను కలిసి, బహిరంగ సభ విజయవంతం చేయాలని విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడుతూ ఈ బహిరంగసభకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల హాజరవుతున్నారని తెలిపారు. గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలోనే గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ఆదివాసీలకు, ఆదివాసీ యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయమని, తద్వారా ఏజెన్సీలోని గిరిజనులకు మంచి రోజులు వస్తాయని ఆశాభావ వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పి చిన్నస్వామి, సోమేశ్వరరావు, జగన్నాథం, మితుల ,పద్మ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్న శాంతకుమారి

జాబ్‌మేళా విజయవంతం

హాజరైన 500 మంది నిరుద్యోగ గిరిజన యువతులు

మాట్లాడుతున్న చింతపల్లి ఎఎస్‌పి ప్రతాప్ శివకిశోర్

ప్రజాశక్తి- చింతపల్లి : 'ప్రేరణ' కార్యక్రమంలో భాగంగా అల్లూరి జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు మంగళవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకు చింతపల్లి వైటిసిలో నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. చింతపల్లి ఎఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ పర్యవేక్షణలో నిర్వహించిన జాబ్‌మేళాకు నిరుద్యోగ గిరిజన యువతులు నుంచి విశేష స్పందన లభించింది. ఈ జాబ్‌మేళాకు చింతపల్లి, జీకే.వీధి, కొయ్యూరు మండలాలకు చెందిన సుమారు 500 మంది ఇంటర్మీడియట్. ఆపై విద్యార్హత కలిగిన నిరుద్యోగ మహిళలు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ గతేడాది ప్రేరణలో భాగంగా నిర్వహించిన జాబ్‌మేళా ద్వారా 70 మందికి టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో సుమారు రూ.20వేల జీతంతో ఉద్యోగాలు పొందారన్నారు., అదే స్ఫూర్తితో నిర్వహించిన జాబ్ మేళాకు మంచిస్పందన లభించడం ఆనందదాయకమన్నారు. టాటా కంపెనీలో ఉద్యోగం పొందడం గౌరవంగా భావించాలని, ఈ కంపెనీలో ఉద్యోగ భద్రతతో పాటు, మంచి జీతం, అలవెన్సులు, ఇతర సౌకర్యాలు కల్పిస్తారన్నారు. ముఖ్యంగా మహిళలకు ప్రత్యేక భద్రత ఉంటుందన్నారు. యాపిల్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్న టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో యాపిల్ ఫోన్ల అసెంబ్లింగ్ యూనిట్లలో పనిచేయడానికి జాబ్ మేళా ద్వారా ఎంపికలు నిర్వహిస్తున్నామన్నారు.

జాబ్ మేళాకు హాజరై, ఇంటర్వ్యూలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఉద్యోగం కల్పించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనలేని నిరుద్యోగ గిరిజన యువత, ఈనెల 8న పాడేరు, 10న రంపచోడవరం, 12న చింతూరులో నిర్వహించే జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులకు భోజన సదుపాయంతోపాటు కొయ్యూరు, జీకె.వీధి మండలాల గిరిజన యువతలకు రవాణా సదుపాయాన్ని కూడా కల్పించారు. కార్యక్రమంలో చింతపల్లి, జికే.వీధి సిఐలు రమేష్, అశోక్ కుమార్, అప్పలనాయుడు, ఎస్ఐలు, అన్నవరం ఎఎస్ఐ ఎం.వెంకటరమణ, టాటా కంపెనీ ఇన్నోవేటివ్ సభ్యులు గోపా కుమార్, సుజిత్, ప్రవీణ్ కుమార్, అచ్యుతాపురం ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డి ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంపిడిఒగా చంద్రరావు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: స్థానిక ఎంపిడిఒగా జి చందర్రావు మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మన్యం పార్వతీపురం జిల్లాలో పనిచేస్తూ, ఇటీవల ఎన్నికల సందర్భంగా నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా డుంబ్రిగుడ మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అధికారులను, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ, విధులను సమర్థవంతంగా నిర్వహించి, మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తన పరిధిలోని సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటానన్నారు.ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతించి, అభినందనలు తెలిపారు.

జిసిసి, వెలుగు ద్వారా జాఫ్రా కొనుగోలు

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని జాఫ్రా రైతులు దళారుల దగ్గర మోసపోకుండా జిసిసి, వెలుగు ద్వారా కొనుగోలు చేసే విధంగా ప్రతిపాదించడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. జాఫ్రా, చింతపండు, పసుపు కొనుగోలు విషయంపై స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జిసిసి డివిజనల్ మేనేజర్, సీనియర్ మేనేజర్లు, వెలుగు ఎపీడీ, డిపిఎం, పిహెచ్ఓ, ప్రాజెక్ట్ అగ్రికల్చరల్ అధికారి తదితరులతో ఐటిడిఎ పిఒ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిడిఎ ద్వారా కొనుగోలు చేసిన జాఫ్రాను వివిధ కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులతో సంప్రదించి మార్కెట్‌కు పంపే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గతేడాది జాఫ్రా, చింతపండు, పసుపు ఎన్ని మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసింది, ఈ సంవత్సరం ఎన్ని మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయనుంది, వీటిని ఎక్కడ స్టోరేజ్ చేయనుంది తదితర వివరాలు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీలో ఎంతమంది జాఫ్రా రైతులు ఉన్నది, ఎన్ని ఎకరాలలో జాఫ్రా సాగు చేయుచున్నది ఆరా తీశారు. ఈ సమావేశంలో జిసిసి డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, వెలుగు ఏపీడీ ఎ.శ్రీనివాసరావు, హార్టికల్చర్ అధికారి చిట్టిబాబు, అగ్రికల్చరల్ అధికారి రాంబాబు, జిసిసి సీనియర్ మేనేజర్లు ముర్ల నాగ వెంకట రాజారెడ్డి, జి.చంద్రశేఖర్, డిపిఎం పరమేశ్వరరావు, వెలుగు యాంకర్ పర్సన్ రామరాజు, వెలుగు ఎపిఎం తదితరులు పాల్గొన్నారు.

హామీలను లిఖితపూర్వకంగా ఇవ్వాలి

ప్రజాశక్తి -సీలేరు

పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణంపై ప్రజల్లో అపోహలు నెలకొన్నాయని, ఏపీ జెన్కో ఉన్నత అధికారులు వీటిని నివృత్తి చేసి లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వాలని అఖిలపక్ష నాయకులు ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి, సర్పంచ్ దుర్జో కారే శ్రీనివాస్, ఎన్.తిరుమలరావు డిమాండ్ చేశారు. స్థానిక గ్రామ సచివాలయంలో గ్రామస్తులతో అఖిలపక్ష నాయకులు మంగళవారం సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సీలేరులో నెలకొల్పుబోయే పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రజాభిప్రాయ సేకరణ కోసం గతంలో గ్రామసభ జరిగిందని, అప్పట్లో జెన్కో అధికారులు స్థానికులకు సకల సదుపాయాలు కల్పిస్తామని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని చెప్పారని గుర్తు చేశారు. కాని ఇప్పుడు ఏపీ జెన్కో అధికారులు ప్రజలకు ఇప్పటివరకు లిఖితపూర్వకంగా ఎటువంటి హామీ ఇవ్వలేదన్నారు. దీనిపై గ్రామస్తులందరూ ఐక్యంగా పునరాలోచన చేసి ప్రజలకు ఎటువంటి నష్టం కలక్కుండా హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కే.వల్లి ప్రసాద్, బాలాజీ లాడ్జి ఓనర్ ఎన్.బాల, కే.సన్యాసిరావు, వెంకట్రావు బుజ్జి, స్థానికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిటిసి సభ్యులు సాంబమూర్తి

దారాలమ్మ ఆలయానికి రూ.50 లక్షలు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దారకొండ ఘాట్ రోడ్‌లో వెలసిన దారాలమ్మ అమ్మవారి ఆలయాన్ని హంగులతో నూతనంగా నిర్మించడానికి రూ.50లక్షలు దేవాదాయ శాఖ మంజూరు చేసిందని ఎండోమెంట్ అధికారి సాంబశివరావు తెలిపారు. మంగళవారం ఆయన ఇంజనీరింగ్ అధికారులతో ఆలయ ప్రాంతాన్ని సందర్శించి అమ్మవారి ఆలయ నిర్మాణానికి కొలతలు వేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో ఎండోమెంట్ డిఈఈ కింతాడ కృష్ణ అమ్మవారి దేవాలయం నిర్మాణ పనులు ప్రారంభిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఏఈలు అన్నెము, వివి.శివప్రసాదు, కాంట్రాక్టర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పక్షవాతంతో బాధపడుతున్న స్కూల్ వంట కుక్ దేవికి ఆర్థిక సాయం అందిస్తున్న యుటిఎఫ్ నేతలు

పక్షవాతం వ్యాధిగ్రస్తురాలికి యుటిఎఫ్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి- అడ్డతీగల

మండలంలోని జిపిఎస్ సోమన్నపాలెం పాఠశాలలో వంట కుక్‌గా పనిచేస్తున్న వీరకోట దేవికి పక్షవాతం రావడంతో లేవలేని స్థితిలో ఉండగా, ఆమెకు యుటిఎఫ్ ఆధ్వర్యాన మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది సేకరించిన విరాళాలు రూ.13,500ను యుటిఎఫ్ నాయకులు కె.చిన్నారావు ఆధ్వర్యాన వ్యాధి గ్రస్తురాలికి అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ యుటిఎఫ్‌లోని ప్రతి సభ్యుడూ సామాజిక స్పృహతో ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.తేజోరావు, మండల గౌరవాధ్యక్షులు పి.రాంబాబు, అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కెవి.రాఘవులు, జిల్లా కౌన్సిలర్ ఎస్.నాగప్రసాద్, ఎంఆర్‌సి సిబ్బంది బుల్లిదొర, రవి, రమణ, వెంకట్రావు, అనిల్, వీరబాబు, రెడ్డి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులు 103 మందికి ట్యాబ్‌లను మంగళవారం ఎంపిపి గోము వెంకటలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడం జరిగిందని చెప్పారు. పాఠశాలలకు నూతన సాంకేతిక పరిజ్ఞానం అందించి విద్యార్థులకు డిజిటల్ క్లాసులు కూడా బోధించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్య బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల పిఎంసి కమిటీ చైర్మన్ సిహెచ్.వీరబాబు, హెచ్ఎం గోపాలకృష్ణ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ కె.తాతబ్బాయి దొర, వైస్ ఎంపీపీ సిహెచ్ సత్య చంద్ర రాణి, గ్రామస్తులు కనిగిరి వీరబాబు, సిహెచ్ అప్పారావు, కె దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంపిపి వెంకటలక్ష్మి తదితరులు

అభినందిస్తున్న సర్పంచ్ పూజారి మేరీ సుబ్బారావు దంపతులు

కరాటే విజేతలకు అభినందన

ప్రజాశక్తి- హుకుంపేట: ఢిల్లీలో జరిగిన జెకెఎస్ సౌత్ ఏషియన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన మండలంలో హానఫ్ హోమ్‌కు చెందిన నలుగురు చిన్నారులను మంగళవారం అభినందించారు. మత్స్యపురం పంచాయతీ కొత్తవలస గ్రామంలో నిర్వహించిన సభలో సర్పంచ్ పూజరి మేరీ, సుబ్బారావు దంపతులు అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, చదువుతోపాటు కరాటే వంటి క్రీడల్లో నైపుణ్యత సాధించడం అభినందనీయమని, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించి, మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. పిల్లలను కరాటే క్రీడలో మెరికల్లా తీర్చిదిద్దిన హోం నిర్వాహకులను కూడా అభినందించారు.

ట్రస్ట్ వ్యవస్థాపకులు అనురాధ మాట్లాడుతూ ఈనెల 6,7 తేదీల్లో న్యూఢిల్లీలోని తల్కాటర్ స్టేడియంలో జరిగిన కరాటే పోటీల్లో తమ హోమ్ చిన్నారులు జి..లక్ష్మి, కె.పింకీ, వి.గౌతమ్, ఎస్ కీర్తి మీనా బంగారు పతకాలను సాధించగా, బి భరత్ కుమార్, పి ఆదిలక్ష్మి రజత పతకాలను, కె.నూకరత్నం, ఎన్.ప్రవీణ్‌కుమార్, యు.మధులత కాంస్య పతకాలను సాధించారన్నారు. బంగారు పతకాలను సాధించిన చిన్నారులు నార్వేలో జరగనున్న అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. పిల్లలకు అద్భుతంగా తర్ఫీదు నిచ్చిన కరాటే కోచ్ పడాల నాగార్జునకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. నార్వేలో పోటీల్లో పాల్గొనేందుకు చిన్నారులకు దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ఈ ఆనందరావు, కోశాధికారి కె.శ్రీనివాస్, బి.సురేష్‌రెడ్డి, ఎస్ ప్రశాంత్ పాల్గొన్నారు.

విమ్స్‌లో వైద్యుల భర్తీకి 9న ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ వైద్యుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ నోటిఫికేషన్ జారీ చేసిందని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. ఎటువంటి రాత పరీక్ష లేకుండా కేవలం ఉత్తీర్ణత శాతం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ బట్టి ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న 19 వైద్య పోస్టులను ఈ నెల 9వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన వైద్యులు నేరుగా హాజరు కావచ్చని పేర్కొన్నారు. స్పెషాలిటీ వైద్యులకు రూ.92 వేలు, సూపర్ స్పెషాలిటీ వైద్యులకు రూ.1.60 లక్షలు వేతనంతో కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు వివరించారు. ఆసక్తి గల వైద్యులు హనుమంతవాక జంక్షన్ వద్ద ఉన్న విమ్స్‌లో నిర్వహించే ఇంటర్వ్యూకు 9వ తేదీన ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు. ఉత్తీర్ణత పత్రాలతో పాటు మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు తీసుకొని హాజరుకావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు http://dme.ap.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఖాళీల వివరాలు

అనస్తీషియా-5, న్యూరో సర్జరీ-1, న్యూరాలజీ-2, కార్డియాలజీ-1, సర్జికల్ ఆంకాలజీ-2, ఎమర్జెన్సీ మెడిసిన్-1, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ (మెడికల్)-3, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ-1, మెడికల్ ఆంకాలజీ-1, ప్లాస్టిక్ సర్జరీ-1, ఎండోక్రైనాలజీ-1, పల్మనాలజీ-1 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

జగనన్న కాలనీలో యథేచ్ఛగా ఆక్రమణలు

ప్రజాశక్తి-మాకవరపాలెం: రెవెన్యూ అధికారుల అండదండలతో మండలంలోని తామరం రెవెన్యూలో అవంతి కళాశాలకు ఎదురుగా ఉన్న జగనన్న కాలనీలో ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. సుమారు 30 సెంట్లు ఖాళీ స్థలంలో సిమెంట్ పోల్స్ వేసి, మట్టితో స్థలాన్ని కప్పేస్తున్నారని అంటున్నారు. ఇటీవల తహశీల్దార్ల బదిలీల తర్వాత, కొత్త రెవెన్యూ అధికారి మారడంతో అక్రమాలకు తెరదీసి, అక్రమాలకు కబ్జాలకు తెగబడుతున్నారని పలువురు అంటున్నారు. అక్రమాలకు పాల్పడిన వారితోపాటు, వారికి అండగా నిలిచిన వారిపై తగు చర్యలు చేపట్టాలని, ఆక్రమణలు తొలగించాలనికోరుతున్నారు.

మాట్లాడుతున్న సిఐ సన్యాసినాయుడు

బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు అన్నారు. రాజవొమ్మంగి జూనియర్ కళాశాల, ఏపీఆర్ జూనియర్ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రేరణ, ఆన్లైన్ మోసాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, రోడ్డు ప్రమాదాలు తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ సన్యాసినాయుడు విద్యార్థినులకు ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్సై జాన్ కుమార్, పోలీస్ సిబ్బంది, ఆయా కళాశాలల సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా పొయ్యిల పంపిణీ

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు మండలం కుమ్మూరు పంచాయతీ మామళ్ళగూడెం గ్రామంలో సర్పంచ్ ముచ్చిక నాగార్జున ఆధ్వర్యంలో ట్రమొంటనా కుక్ స్టవ్ పొయ్యిలు 800 పంపిణీ మంగళవారం చేశారు. వాటిని ఎలా ఉపయోగించాలో తెలియజేశారు. ఈ పొయ్యిల వల్ల పొగ శాతం వరకు తగ్గుతుందని, దీంతో అనేక అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. కుక్ స్టవ్ పొయ్యి వెలగడానికి పదేపదే ఇందనం ఉపయోగించవలసిన అవసరం ఉండదని, తక్కువ కర్రలతో తక్కువ సమయంలో ఎక్కువ వంట చేయవచ్చని చెప్పారు. ఒక కేజీ కర్రలు 1.30 గంటల పాటు మండుతుందన్నారు. ఈ పొయి ద్వారా దాదాపుగా 60 70 శాతం కర్రలు వినియోగం తగ్గించవచ్చని తెలిపారు. మట్టి పోయి కంటే ఈ కుక్ స్టవ్ పోయి మూడు రెట్లు అధికంగా మండుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రఘుబాబు, వాలంటీర్లు జయలక్ష్మి, శోభన, లబ్ధిదారులు ముచ్చిక రాజయ్య, రాములమ్మ, నవీన్, లక్ష్మి, ట్రమొంటన కుక్ క్రాప్ జోన్ మడివి సుందరయ్య మండల కో-ఆర్డినేటర్ రామారావు, గోవింద, సోడి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి కోరుకొండ రాజీనామా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపి విశాఖ పార్లమెంట్ కార్యదర్శి, దక్షిణ నియోజకవర్గం నాయకుడు కోరుకొండ సూర్యప్రసాద్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన రాజీనామాను వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులకు అందించినట్టు తెలిపారు. ఇప్పటి వరకూ ఎటువంటి పదవులూ ఆశించకుండా పార్టీ కోసమే పనిచేశానన్నారు. ఈ మధ్య జరిగిన కొన్ని కారణాల వల్ల పార్టీకి రాజీనామా చేయాల్సి వచ్చిందన్నారు.

జనసేన ఉత్తరాంధ్ర ముఖ్య ప్రతినిధిగా సతీష్ కుమార్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జనసేన ఉత్తరాంధ్ర పార్టీ వ్యవహారాల ముఖ్య ప్రతినిధిగా నగరానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సుందరపు సతీష్ కుమార్‌ని పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ నియమించారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈ మేరకు ఆయనకు పవన్ నియామక పత్రాన్ని అందజేశారు.

సిఐఐ ఆధ్వర్యాన ఎంఎస్ఎంఇ సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిఐఐ - సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫాక్చరర్స్ (ఎస్ఐడిఎం), రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన రక్షణ ఉత్పత్తి విభాగం సహకారంతో మంగళవారం ఉదయం నగరంలో ప్రాంతీయ ఎంఎస్ఎంఇ సదస్సు నిర్వహించారు. మేకిన్ ఇండియా, స్వదేశీకరణ కార్యక్రమాల్లో భాగస్వామ్యాన్ని పెంపొందించుకునేందుకు, వివిధ భౌగోళిక ప్రాంతాల్లో ఎంఎస్ఎంఇలను క్షేత్రస్థాయిలో నిమగ్నం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల శాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్ మాట్లాడారు.

ఏజెన్సీ దళితులపై నిర్లక్ష్యం తగదు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి- చింతపల్లి: ఏజెన్సీలోని దళితుల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపడం తగదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం చింతపల్లి అంబేద్కర్ దళితవాడకు వెళ్ళి, అక్కడి దళితులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఏజెన్సీలోని దళితులకు ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా సంక్షేమ పథకాలను ఇవ్వడం లేదన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, స్వయం ఉపాధి పథకాలకు ప్రోత్సాహం ఇవ్వడం లేదన్నారు.దాదాపు ఐదు దశాబ్దాల క్రితం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న దళితులందరినీ ఒక చోటకు చేర్చి, దానికి అంబేద్కర్ దళితవాడ అని పేరు పెట్టి, తర్వాత వారిని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేశారన్నారు. అప్పట్లో ఇచ్చిన ఇంటిలోనే ఇపుడు నాలుగైదు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. పెరుగుతున్న కుటుంబాలకు అనుగుణంగా వీరికి ఇళ్లస్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాలకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఏజెన్సీ దళితులు ఆవేదన చెందుతున్నారన్నారు. చాలీచాలని ఇరుకైన ఇళ్లలో, టార్పాలిన్ కవర్లు వేసుకుని నానా ఇబ్బందులు పడుతూ వీరు జీవనం సాగిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఏజెన్సీలో చదువుకున్న దళిత విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేని పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి కార్మికులుగా జీవనం సాగిస్తున్నారన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, అంబేద్కర్ దళిత కాలనీవాసులకు కుటుంబాల సంఖ్యకు తగ్గట్టుగా సమీప సిల్క్‌ఫారం వద్ద ఇళ్ల స్థలాలను

దళిత కాలనీలో ఇళ్లను పరిశీలిస్తున్న చిన్నయ్యపడాల్

కేటాయించి, ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఏజెన్సీలోని దళిత యువతకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా నిధులు కేటాయించి, అభివృద్ధి, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, నిరుద్యోగ దళిత యువత స్వయం ఉపాధికి బ్యాంకు రుణాలు, ఇతర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. వీరిని కేవలం ఓటుబ్యాంకుగానే వినియోగించుకుని వదిలేస్తున్న రాజకీయ పార్టీలు, నేతలు ఇప్పటికైనా వీరిపై దృష్టి సారించాలని చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నూకరాజు, చిన్నతల్లి పాల్గొన్నారు.

రెండో రోజుకు పెన్షనర్ల దీక్షలు

దీక్షలో కూర్చున్న జింక్ స్మెల్టర్ పెన్షనర్లు

ప్రజాశక్తి -కరాస : ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన మర్రిపాలెంలోని పిఎఫ్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం నాటికి రెండో రోజుకు చేరుకున్నాయి. రెండో రోజు దీక్షలో జింక్ స్మెల్టర్ పెన్షనర్లు కూర్చున్నారు. ఈ దీక్షలనుద్దేశించి సంఘం సీనియర్ నాయకులు ఎస్.కనకేశ్వరరావు మాట్లాడుతూ, 14 సంవత్సరాల నుంచి ఇపిఎఫ్ 95 పెన్షనర్లు అలుపెరగని పోరాటం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వానికి పట్టడంలేదన్నారు. ఇప్పటికి 30 లక్షలు మందికి వెయ్యి రూపాయల లోపు పెన్షన్ వస్తుందని, దీనికి తోడు ఆరోగ్య సమస్యలు, అధిక ధరలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లు అవుతున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్, కెపి.కుమార్, శ్రీనివాస్‌మూర్తి, సూర్యప్రకాష్, ఎన్.రామలింగేశ్వర, బిటి.మూర్తి, టి.భాస్కరరావు, వెంకటేశ్వరరావు, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇచ్చేవరకు పనులు చేపట్టొద్దు

ప్రజాశక్తి- నక్కపల్లి : నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీ చెల్లించే వరకు వైజాగ్, చెన్నయ్ కారిడార్‌లో ఎటువంటి పనులు చేపట్టవద్దని టిడిపి, సిపిఎం నాయకులు, నిర్వాసితులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని చందనాడ రెవిన్యూ పరిధిలో కారిడార్‌కు సేకరించిన భూములలో జెసిబితో తుప్పలు,డొంకలు తొలగింపు వంటి పనులను అధికారులు ప్రారంభించిన నేపథ్యంలో విషయం తెలుసుకున్న నిర్వాసిత రైతులు అక్కడకు చేరుకుని, యంత్రాల ముందు బైఠాయించి పనులను అడ్డుకున్నారు ఈ నేపథ్యంలో ఎపిఐఐసి అధికారులకు, రైతులకు వాగ్వివాదం చోటుచేసుకుంది..ఈ సందర్భంగా నిర్వాసిత రైతులు, నేతలు మాట్లాడుతూ భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు భూములతోపాటు కోల్పోతున్న ఇళ్లు, చెట్లకు నష్టపరిహారం, ప్యాకేజీ ఇవ్వకుండా పనులు చేపట్టడం అన్యాయమన్నారు. వెంటనే అన్ని నిర్వాసిత గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి నిర్వాసిత రైతులతోపాటు ప్రభావిత గ్రామాల్లో వృత్తిదారులు, ఇతర ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించిన తర్వాతే పనులు చేపట్టాలని కోరారు. లేకుంటే అడ్డుకోక తప్పదని హెచ్చరించారు. నిర్వాసితుల ఆందోళనకు తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అమలాపురం సర్పంచ్ శంకరరావు, ఎం.రాజేష్, నరసింగరావు పాల్గొన్నారు.

అమ్మో వెల్లుల్లి

ఆల్ టైం రికార్డు ధరల ఘాటుతో జనం బెంబేలు
బహిరంగ మార్కెట్లో కిలో రూ.400 పైమాటే
'నాగ్‌పూర్ స్టాక్ మార్కెట్ మాఫియా' నియంత్రణే కారణమా?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వెల్లుల్లి ధర.. జనాన్ని భయపెడుతోంది. బహిరంగ మార్కెట్లో కిలో రూ.400పైనే ఉందంటే పరిస్థితిని అర్థం చేసుకోవొచ్చు. నెలనెలా పెరిగిపోతున్న వెల్లుల్లి ధరలతో గార్లిక్ ట్రేడింగ్ కంపెనీలు, వ్యాపారులు వందలు, వేల కోట్ల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వెల్లుల్లి ధర కొద్ది నెలలుగా పెరుగుతూ పోతుండటంతో విశాఖ వాసుల్లో చాలా మంది వీటి వినియోగం తగ్గించారు.



ధర ఎందుకిలా..

దేశంలో వెల్లుల్లి పంట సాగు ఉత్పత్తులు ఏడాదిలో రెండు దఫాలుగా వచ్చే 'బిగ్ మార్కెట్'గా ముంబయికి సమీపంలోని నాగ్‌పూర్ పేరుగాంచింది. ఇక్కడ సుమారు 120కి పైగా వెల్లుల్లి ట్రేడింగ్ కంపెనీల పెత్తనం ఈ సరుకుపై కొనసాగుతోంది. చాలా రాష్ట్రాలకు ఇక్కడ నుంచే వెల్లుల్లి ఎగుమతి అవుతోంది. దేశంలో ఇటీవల కురిసిన వర్షాలు, మహారాష్ట్రలోని పూణె, నాశిక్‌లలో పడ్డ వర్షాలతో వెల్లుల్లి పంట తీవ్రంగా దెబ్బతింది. సుమారు 32 వేల హెక్టార్లలో ఈ వెల్లుల్లి సాగు జరుగుతుండగా 20 వేల హెక్టార్లలో ఈ సాగుపై తీవ్ర వర్షాల ప్రభావం పడింది. తొలి నుంచీ నాగ్‌పూర్ స్టాక్ మార్కెట్‌లో బడా వ్యాపారుల మాఫియా వెల్లుల్లిపై కొనసాగుతూ వస్తోంది. గడచిన ఆరు నెలల్లో లభ్యమైన వెల్లుల్లి ధరలను అమాంతంగా వీరు పెంచేసుకుని పబ్బం గడుపుకుంటున్నారని విశాఖపట్నానికి చెందిన పలువురు వెల్లుల్లి వ్యాపారులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ మొత్తంగా పలు మార్కెట్లలో వెల్లుల్లి కొరత ఏర్పడగా, ఉన్న చోట్ల ధరాఘాతంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారని విశాఖకు చెందిన వెల్లుల్లి ట్రేడర్ జానకీరామ్ రాజేష్ 'ప్రజాశక్తి' వద్ద వెల్లడించారు. కిలో రూ.400 పైచిలుకు ధరకు ఎగబాకడం వల్ల క్వింటాకు రూ.8500 వరకూ అదనంగా పెరిగి భారంగా మారిపోయిందని తెలిపారు. ఇలా నాగ్‌పూర్ మాఫియా మార్కెట్‌ను గుప్పెట్లో పెట్టుకుని రూ.వందల కోట్లును నెలనెలా కొల్లగొడుతోందని వెల్లడించారు.

ధరలు దిగాలంటే కొత్త పంట రావాల్సిందే..

వర్షాలకు దెబ్బతిన్న తర్వాత వేసిన కొత్త పంట మార్కెట్‌లోకి ఇంకా రాకపోవడంతో నెలనెలా వెల్లుల్లి ధరలు పెరిగిపోతున్నాయి. కొత్త వెల్లుల్లి పంట మార్కెట్‌లోకి ఏప్రిల్‌లో వచ్చే అవకాశముంది. అప్పటి వరకూ వెల్లుల్లి ధరలు పెరిగే అవకాశమే ఉంది. గడచిన నాలుగు నెలల్లో 5 దఫాలు వెల్లుల్లి ధరలు అమాంతంగా పెరగడం వినియోగదారులకు భారంగా మారింది. ఒక్కసారిగా భారీగా పెరిగిపోయిన ధరతో మార్కెట్‌లో అనేక చోట్ల వెల్లుల్లి కానరావడం లేదు. గతంలో పావు కిలో రూ.20కే లభ్యమైన వెల్లుల్లిని నేడు రూ.100 నుంచి రూ.150 దాకా మార్కెట్‌లో అమ్ముతున్నారు. కిలో ధర 3 నెలల క్రితం రూ.300 ఉండగా నేడు రూ.400 దాటేయడంతో వినియోగదారులు కొనడం మానుకున్నారు.

ఇలా అయితే వంటల్లో వెల్లుల్లిని మరచిపోవాల్సిందే

పెరిగిన వెల్లుల్లి ధరల భారంతో సామాన్యులు తమ వంటకాలు, ఆహారం నుంచి వెల్లుల్లిని వదిలేసుకునే పరిస్థితులు వస్తున్నాయి. ప్రభుత్వం బాధ్యత తీసుకుని బజార్లలోని చౌక ధరల దుకాణాల్లో సబ్సిడీపై వెల్లుల్లిని అమ్మేలా చర్యలు తీసుకోవాలి

- కందిమల్ల రాజు, విశాఖపట్నం

కనీసం రూ.100 ఉంటేగానీ వెల్లుల్లి రావడం లేదు

కిలో సంగతి దేవుడెరుగు.. కనీసం రూ.100 వెచ్చిస్తేగానీ వెల్లుల్లి ఇవ్వడం లేదు. ఇలా అయితే రానున్న రోజుల్లో వంటల్లో వెల్లుల్లి కనిపించకుండా పోతుంది. వంటకారంలో ప్రధాన వస్తువు అయిన వెల్లుల్లిని మరిచిపోవాల్సిందే.

- మల్లికాంబ, గృహిణి, విశాఖపట్నం

'ఆడుదాం - ఆంధ్ర'కు విస్తృత ప్రచారం కల్పించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు, మరింత అత్యున్నతంగా తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం - ఆంధ్ర రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని జివిఎంసి అదనపు కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు విశాఖపట్నం వేదికగా జరిగే ఆడుదాం - ఆంధ్ర పోటీలకు సంబంధించిన ప్రచార ఏర్పాట్లపై మంగళవారం ఉదయం ఆయన తన ఛాంబర్లో వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శాప్, క్రీడాప్రాధికార సంస్థ, సమాచార పౌర సంబంధాల శాఖ, జివిఎంసి జోనల్ కమిషనర్లు, ప్లానింగ్ సెక్రటరీలు తదితరులు పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ నగరంలోని ప్రధాన కూడళ్లలో, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో హోర్డింగులు, జెండాలు, బిల్ బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. క్రీడాకారులు దూర ప్రాంతాల నుంచి వస్తారు కాబట్టి వారికి స్వాగతం పలుకుతూ నగరం ప్రారంభంలో ఆనందపురం, అనకాపల్లి, గాజువాక, అగనంపూడి ప్రాంతాల్లో హోర్డింగులు పెట్టాలని సూచించారు. రైల్వే, బస్ స్టేషన్లలో వెల్‌కం కౌంటర్లు ఏర్పాటు చేయాలని, అక్కడ కూడా ఆడుదాం - ఆంధ్ర క్రీడా విశేషాలను తెలుపుతూ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో శాప్ డీడీ రమణ, డిఎస్‌డిఒ జూన్ గ్యాలియెట్, సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్ పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ అంచనా బడ్జెట్‌కు ఆమోదం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధర్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సవరణ బడ్జెట్, 2024-25 బడ్జెట్ అంచనాలకు ఆమోదం లభించింది. జిల్లాలోని గ్రంథాలయాల్లోని మౌలిక వసతులు, అభివృద్ధి చర్యలు చేపట్టేందుకుగాను రూపొందించిన బడ్జెట్ అంచనాలపై శ్రీనగర్ కాలనీలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సమావేశం జరిగింది.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో మూగజీవాలు మృత్యువాత

ప్రజాశక్తి- హుకుంపేట : మండలంలోని జర్రాకొండ పంచాయితీ గనిక గ్రామంలో విద్యుత్ వైర్లు తెగిపడడంతో నాలుగు పశువులు మృత్యువాత పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం వల్లే ఘటన చోటుచేసుకుందని, బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు డిమాండ్ చేశారు.

కరెంట్‌షాక్‌తో మృతి చెందిన పశువులు

గ్రామానికి చెందిన గిరిజన రైతులు తమ పశువులను డిగ్రాపల్లి కిందగెడ్డ పొలాల వద్ద మేతకు తీసుకెళ్లగా, అక్కడ తెగిపడిన విద్యుత్ వైర్లును గమనించక, వాటిని తాకడంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాయని స్థానికులు అంటున్నారు. గ్రామానికి చెందిన మాదేల చిన్నయ్య, జన్ని నర్సన్నలకు చెందిన రెండు కోడెద్దులతోపాటు మజ్జి సొమ్మన్నకు చెందిన ఆవు దూడ, సారే దేముడుకు చెందిన ఆవు విద్యుత్‌షాక్‌తో చనిపోయాయి. వ్యవసాయ పనులకు ఉపయోగించే పశువులు మృత్యువాతతో గిరిజన రైతులు లబోదిబోమంటున్నారు. అదీగాక తెగిపడిన వైర్లను మనుష్యులు తాకి ఉంటే పరిస్థితి ఏంటని ఆవేదన, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడం ద్వారా ఇటువంటికి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అలాగే ఒక్కో పశువుకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించి, బాధిత కుటుంబాలకు బాసటగా నిలవాలని వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు అన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడు అరెస్టు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ భీమరాజు తెలిపారు. మండలంలోని అమలాపురం గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన వరుసకు అన్నయ్య అయ్యే యువకుడు, బాలికను బైక్‌పై ఎక్కించుకుని తీసుకెళ్ళి, అప్పన్నపాలెం చెరుకు తోటలో అసభ్యకరంగా ప్రవర్తించాడు. వేములపూడి గ్రామం నుంచి అమలాపురం వెళ్లేందుకు రోడుపై బాలిక ఎదురుచూస్తుండగా బైక్ ఎక్కించుకుని తీసుకెళ్ళి, అప్పన్నపాలెం గ్రామ సమీపంలో చెరుకు తోట వద్ద దుశ్చర్యకు పాల్పడ్డాడు. దీనిపై బాలిక తన తల్లిదండ్రులకు తెలియజేయగా, వారు స్థానిక రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ భీమరాజు తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - రావికమతం : మండలంలో గుమ్మల్లపాడు గ్రామానికి చెందిన పారుపల్లి కనకం (55) అనే వ్యక్తి పురుగుల మందులు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కనకం, మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. షెడ్‌లో నోటి వెంట నురగలు కక్కుతూ అపస్మారక స్థితిలో ఉన్న కనకంను, కుటుంబసభ్యులు హుటాహుటిన నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి 104 వాహనం ద్వారా తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై రావికమతం ఎస్ఐ ధనంజయ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్వరితగతిన సమగ్ర భూ రీసర్వే

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలో ఒడ్డిప, జె.నాయుడుపాలెం గ్రామాల్లో సమగ్ర భూ రీ సర్వే జరుగుతోందని, ఆయా గ్రామాల్లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డిఒ సిహెచ్ జయరాం సూచించారు. మంగళవారం మంగళవారం రోలుగుంట తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒడ్డిప, జె.నాయుడుపాలెం గ్రామాల్లో రీసర్వే త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను. ఎంకె.పట్నం విఆర్ఒ రాజులమ్మపై ఫిర్యాదులు అందాయని, వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రవిచంద్ర, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ అప్పారావు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్ కృష్ణ జ్యోతి

పోలింగ్ బూత్‌ల్లో మౌలిక సదుపాయాల కల్పన

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం మండల పరిధిలో ఉన్న పోలింగ్ బూతులలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం మండల తహశీల్దారు ఎ.కృష్ణ జ్యోతి పేర్కొన్నారు. మండలంలోని 13 పోలింగ్ బూతులను మంగళవారం ఆయన పరిశీలించారు. అన్ని పోలింగ్ బూతులలో మౌలిక సదుపాయాలు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించి ఎప్పటికప్పుడు పై అధికారులకు నివేదికల సమర్పించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ప్రతి పోలింగ్ బూతులో కరెంటు, మరుగుదొడ్లు ఉన్నదీ లేనిదీ పరిశీలిస్తున్నట్లు చెప్పారు. తహశీల్దారు వెంట సీనియర్ అసిస్టెంట్లు ఇందిరా బాయ్, చెల్లాయమ్మ, టి.లక్ష్మణ్, ఆర్ఐ యన్.విగ్నేష్, వీఆర్వోలు ఉన్నారు.

తహశీల్దారుగా నజీముల్లా షా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - చింతూరు : మండల తహశీల్దారుగా నజీముల్లా షా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చట్టి పాఠశాలలోని పోలింగ్ బూత్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పోలింగ్ బూతులు అన్నింటిని పరిశీలించనున్నట్లు చెప్పారు.

విశాఖలో ఎన్‌డిసి బృందం పర్యటన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 16 మందితో కూడిన జాతీయ భద్రతా కళాశాల (నేషనల్ డిఫెన్స్ కాలేజీ) ఢిల్లీ బందం విశాఖలో పర్యటించింది. మూడు రోజుల పాటు జిల్లాలో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును ఈ బృందం పర్యవేక్షణ చేయనుంది. ఈ క్రమంలో ఎయిర్ వైస్ మార్షల్ మనీష్ కుమార్ గుప్తా నేతృత్వంలోని ఈ బృందం మంగళవారం విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో కలిసింది. జిల్లాలో పర్యటిస్తున్న బృంద సభ్యులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వైద్యం, విద్య, వ్యవసాయం, యువతకు వృత్తి నైపుణ్యత, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలను తెలియజేశారు. ఈ బృందంలో ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌కు చెందిన అధికారులు, వివిధ దేశాలకు చెందిన సైనిక అధికారులు ఉన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'కారా కథలు - సామాజిక వాస్తవికత' గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆచార్య వెలమల సిమ్మన్న రాసిన 'కారా కథలు - సామాజిక వాస్తవికత' గ్రంథాన్ని ఆకాశవాణి విశాఖపట్నం కార్యక్రమాల విభాగాధిపతి పివి.రాంగోపాల్ ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంగోపాల్ మాట్లాడుతూ కారా కథల వైవిధ్యాన్ని, విశిష్టతను వివరించారు. కారా రాసిన 'సంకల్పం' కథ చాలా గొప్పదని కొనియాడారు. ఆచార్య సిమ్మన్న తన గ్రంథాన్ని ఆకాశవాణి విశాఖపట్నం పూర్వ ఎనౌన్సర్ డాక్టర్ కానేటి మధుసూదన్‌కు అంకితం ఇచ్చారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ కారా సుప్రసిద్ధ కథకులని ప్రశంసించారు. ఆచార్య సిమ్మన్నకు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రంథకర్త సిమ్మన్న మాట్లాడుతూ కారా కథల గొప్పతనాన్ని వివరించారు. ఎయు తెలుగు విభాగం పూర్వ విశ్రాంత ఆచార్యులు ఆచార్య కొండపల్లి సుదర్శన్ రాజు మాట్లాడుతూ సిమ్మన్న అనేక రచనలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఆకాశవాణి విశాఖపట్నం సీనియర్ ఎనౌన్సర్ డాక్టర్ బండి సత్యనారాయణ, అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, విశాఖ సంస్కృతి మాస పత్రిక సంపాదకులు శిరేల సన్యాసిరావు, రాంభట్ల నృసింహ శర్మ, డాక్టర్ మోకా ప్రతాప్, బేత రామసూర్య ప్రకాష్, ఎన్.సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.